క్లుప్తంగా

నేటినుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



దామెర: మండలంలోని ఊరుగొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నేడు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జనవరి 8న ప్రాభోధికం, తొలక్కం కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమై, 18న దుర్గంపేటలో నిర్వహించే శావ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. జాతరలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులుకాగలరని అన్నారు.

చెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట: మండలంలోని మందారిపేట స్టేజీ వద్ద దళిత కాలనీలో శాయంపేటకు వెళ్లే రోడ్డు వెంబడి విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను ఏఈ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం అనే పేరున ఈనెల 6న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు వైర్ల కింద ఉన్న చెట్లను తొలగించారు. దీంతో గ్రామస్తులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆపరేటర్ నియామకం

ఎల్కతుర్తి: జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆధార్ ఆపరేటర్‌గా రాజ్‌కుమార్‌ను నియమించినట్లు విద్యాశాఖ మండల అధికారి ఈసారి రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ నమోదు చేయడంతో పాటు ఆధార్‌లో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేయడం అతని విధి అని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మొరం తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

శాయంపేట: శాయంపేట గ్రామంలోని మచ్చర్లయ్యగుట్ట వద్ద రాత్రివేళల్లో అక్రమంగా మొర్రం తరలిస్తున్న టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించినట్లు మైనింగ్ ఏడీ రవీందర్ తెలిపారు. శాయంపేట గుట్ట వద్ద రాత్రివేళల్లో మొర్రం పెద్దమొత్తంలో తరలిస్తున్నారనే ఫిర్యాదు మేరకు మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మొరంతోడిన ప్రదేశంలో జాయింట్ సర్వే చేయించి పెనాల్టీ విధిస్తామని మైనింగ్ ఏడీ రవీందర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

ఆత్మకూరు: మండలకేంద్రంలోని ఎంఆర్‌సీలో మెస్సెంజర్‌గా పనిచేస్తున్న రమాదేవి అల్లుడు బోనగిరి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మండలానికి చెందిన పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎ.బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాధితకుటుంబానికి శనివారం రూ.26వేలు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మణ్‌రావు, భిక్షపతి, సీఆర్‌పీ కల్పన పాల్గొన్నారు.

పరామర్శ

ఆత్మకూరు: బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో వివిధకారణాలతో మృతి చెందిన పలుకుటుంబాలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆయన శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగెల్లి సామెల్, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, నాయకులు కాడబోయిన రమేష్, బయ్య తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పరకాల: రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని చలివాగు వంతెన వద్ద శనివారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రామయ్యగుండాలపల్లె గ్రామానికి చెందిన మొదుపల్లి రమేష్(50) అనే కిరాణం వ్యాపారి మృతి చెందాడు. కిరాణ సామానులు కొనుగోలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతున్న క్రమంలో చలివాగు వంతెన వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తలకు, ఛాతికి బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం తెలియగానే పరకాల సీఐ కిషన్, ఎస్సై ప్రశాంత్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలపై విచారణ చేపట్టారు.

‘ఎల్టా’ కృషి అభినందనీయం



శాయంపేట: ప్రశంసపత్రాలతో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయురాలు



భీమదేవరపల్లి: విద్యార్థికి ప్రశంసపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయులు



పరకాలలో..



నడికూడలో..

ఆత్మకూరు: విద్యార్థుల్లో ఆంగ్లంపై ఆసక్తిని కలిగిస్తూ భయాలను పోగొట్టడంలో ఎల్టా(ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) కృషి అభినందనీయమని ఎంఈఓ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో శనివారం ఎల్టా, టీఎస్ ఎస్‌ఈఆర్‌టీ, భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. స్పెల్ విజార్డ్‌లో భవాని(ఆత్మకూరు జెడ్పీహైస్కూల్) ప్రథమ బహుమతి, నాన్సీ (కేజీబీవీ, ఆత్మకూరు) ద్వితీయ బహుమతి, స్టోరీ టెల్లింగ్‌లో అజయ్ (జెడ్పీహైస్కూల్, చౌళ్లపెల్లి) ప్రథమ, చరణ (జెడ్పీహైస్కూల్, ఆత్మకూరు)ద్వితీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నిర్మలకుమారి, రవికుమార్, వాసవి, పద్మ, జయంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట: విద్యార్థులు ఆంగ్లభాషపై నైపుణ్యాన్ని పెంపొందించుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతాలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో శనివారం ఎల్టా ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ కాంపిటిషన్ నిర్వహించారు. మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో భానుశ్రీ, చరణ్‌రాజ్‌లు నిలవగా, స్టోరీటెల్లింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను వర్షిత, రోహిణి సాధించారు. వీరికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈనెల 22న జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్లు రాజీబాపు, కల్పన, ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లి: మండలంలోని ముల్కనూర్ మోడల్ స్కూల్లో ఆంగ్లభాషకు సంబంధించి స్పెల్ విజార్డు, స్టోరీ టెల్లింగ్ విభాగాలల్లో శనివారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో గట్లనర్సింగాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి అశ్రితసాయి స్పెల్ విజార్డు విభాగంలో ప్రథమ బహుమతి, మోడల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని జి.సంజన ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. స్టోరిటెల్లింగ్ విభాగంలో మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని హాసిని మొదటి బహుమతి, గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతికి విద్యార్థిని శివనందిని ద్వితీయ బహుమతి గెలుచుకుంది. జనవరి 22న జిల్లా స్థాయిలో జరిగే పోటీలలో ఈవిజేతలు పాల్గొననున్నారు. కాగా, విద్యార్థుల ఎంపికపై హెచ్‌ఎం మద్దెల కుమారస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాంబాబు, కర్ణాకర్, సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్, ధర్మ హర్షం వ్యక్తం చేశారు.

పరకాల: పరకాల మండల స్థాయి స్టోరి టెల్లింగ్, స్పెల్ విజార్డ్‌లో పరకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల) విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. పరకాల మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవి పర్యవేక్షణలతో ఎల్టా పరకాల శాఖ నిర్వహించిన పోటీలలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్.శివకుమార్ ప్రథమ స్థానంలో, కె.గణేష్ తృతీయ స్థానంలో నిలవగా, నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పి.లిల్లి ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.మాధవి, వి.భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నడికూడ: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ శనివారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆంగ్లభాష పరిజ్ఞానంపై స్పెల్ విజార్డ్, స్టోరీటెల్లింగ్ పోటీలు నిర్వహించి, సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్ అంటే ఉండే భయాన్ని తొలగించేందుకు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి పాఠశాల స్థాయి నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్



చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

పరకాల: పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్(బిట్స్)లో నిర్వహించిన చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. తెలంగాణ పండుగల పిండివంటలను చిన్నారులు ప్రదర్శించగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పండగల ప్రాముఖ్యతను పెంపొందించటానికి ఎంతగానో దోహదపడుతాయని బిట్స్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

శాయంపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ సదయ్య ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కమిటీ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కళాశాల సిబ్బంది సునీల్‌కుమార్, కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి మూల వేణు, రోహిత్, వికాస్, నర్ర రామ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది



మాట్లాడుతున్న డాక్టర్ విజయచందర్‌రెడ్డి



సమావేశానికి హాజరయిన నాయకులు

పరకాల: ఓవైపు 24 గంటల ఉచిత కరెంట్ అంటూ.. మరోవైపు గృహ వినియోగదారుల కరెంట్ చార్జీలు పెంచి విద్యుత్ సంస్థలు దోచుకుంటున్నా, ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయచందర్ రెడ్డి, బీజేపీ పరకాల నియోజకవర్గ ప్రభారి ఉడుముల రమేష్ అన్నారు. రైతుల ఆత్మహత్యలో తెలంగాణ దేశంలో నాల్గవ స్థానంలో ఉండటం బాధాకరమైన విషయమన్నారు. 119 నియోజకవర్గాల బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల వర్చువల్ సమ్మేళనం శనివారం జరిగింది. పరకాల నియోజకవర్గ సమ్మేళనంలో లలిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయాల రుణమాఫీ చేయకపోవడంతో నాలుగేళ్లుగా వడ్డీ భారంగా మారిందన్నారు. మరోవైపు రైతుబంధు అంటూ రైతుల సబ్సీలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వం ఎత్తివేసిందని ఆరోపించారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను మళ్లించి సర్పంచ్‌లను మోసం చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఓంటేరు జయపాల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

ఆత్మకూరు: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. మండల చెందిన బయ్య పైడి ఆచార్యతో పాటు మండలానికి చెందిన పలువురు వివిధపార్టీల నుంచి పరకాలలో జరిగిన పార్టీ కార్యక్రమంలో బీజేపీలో చేరారు. వీరికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్‌సెల్ కన్వీనర్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అనంతర బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను బయ్య పైడి ఆచార్య కలిశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

భూములు పంచేవరకు పోరాటం



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



కమలాపూర్‌లో..

ధర్మసాగర్: రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ప్రభుత్వ భూములు పంచే వరకు, ఇళ్ల పట్టాలు, ఐదు లక్షల రూపాయలు ఇచ్చే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పేదల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో శనివారం సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి ముగింపు సభ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామ శివారులో సర్వే నంబర్ 898/1 లో 21.33 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఇందులో పేదలు 100 గజాల జాగ కోసం గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ అధికారులు కేసులు పెట్టారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ జిల్లాలో భూమాఫియా ప్రభుత్వ భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ పేరుతో అమ్మకాలు కొనసాగిస్తున్నారని తెలిసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఎల్లేష్, శంకర్, దీన, మలయ్య, రత్నం, రాజయ్య, రాజు, దేవయ్య, ఉన్నారు.

ముప్పారంలో..

మండలవ్యాప్తంగా ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు డిమాండ్ చేశారు. మండలంలోని ముప్పారం గ్రామంలో ఆసంఘం మండల కార్యదర్శి చిలుక రాఘవులు ఆధ్వర్యంలో సర్వే నంబర్ 585 లో శనివారం ఇళ్ల స్థలాల కోసం జెండాలు పాతారు. ఇందులో సాంబరాజు, రమేష్, రాజేశ్వరి, ప్రమీల, రాజేశ్వరి, ప్రభాకర్, రాజు, భాస్కర్, వెంకటయ్య ఉన్నారు.

కమలాపూర్: కమలాపూర్ మండంలోని గూడూరులో సీపీఐ ఆధ్వర్యంలో పేదలు శనివారం భూపోరాటానికి దిగారు. గూడూరులోని 143 సర్వేనంబరులో గల ప్రభుత్వ భూమిలో పేదలతో కలిసి సీపీఐ నాయకులు జెండాలు పాతారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాణి, ఎస్సై చరణ్, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని సీపీఐ నాయకులు, పేదలతో మాట్లాడారు. తమకు నివేశన స్థలాలిచ్చే వరకు భూపోరాటాలు కొనసాగిస్తామనడంతో పోలీసులు సీపీఐ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజుగౌడ్, నాయకులు ఇంసపెల్లి శంకర్, శిరీష, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నడికూడ: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 11న బెంగళూరులో జరగబోయే జాతీయ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ పార్టీ చెప్పి మాదిగలను మోసం చేసిందని విమర్శించారు. వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే రాబోయే ఎన్నికలలో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుప్పటి మొగిలి, ప్రవీణ్, సుమన్, అఖిల్, సుధాకర్, రాజు, రాజయ్య, ప్రణయ్, రవి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభలు



ఒగ్లాపూర్ గ్రామసభలో పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యుడు

దామెర: జాతీయ ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ బృందం పలుగ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని ముస్త్యాలపల్లి, దుర్గంపేట్, తక్కళ్లపహాడ్, దామెర, పసరగొండ, సీతారాంపూర్, ఒగ్లాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పనులపై చర్చించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన పనుల ప్రగతిపై నివేదికలు చదివి వినిపించారు. ఎస్‌ఆర్పీలు రాంబాబు, సుధాకర్ ఆధ్వర్యంలో తనిఖీ బృందం అడిగిన సందేహాలకు కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమాధానం చెప్పారు. గ్రామసభల్లో ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్ రావు, ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణకు చర్య తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

దామెర: నర్సరీల్లో నాటిన మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని ఊరుగొండ, పసరగొండలోని నర్సరీని ఆయన తనిఖీ చేశారు. నర్సరీలో ఏఏ మొక్కలు పెంచుతున్నారు, మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విత్తనాలు మొలకెత్తని సంచులను గుర్తించి వేరే విత్తనాలు నాటాలని సూచించారు. వనసేవకులు నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, ఉపసర్పంచ్ విద్యాసాగర్, కార్యదర్శి వేణుమాధవ్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎల్‌ఓసీ అందజేత

ధర్మసాగర్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన దిడ్డి రజితకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ముప్పారం గ్రామ పరిరక్షణ సమితి కన్వీనర్ గుంటిపల్లి రేణుక చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన రజిత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో పరీక్షలు నిర్వహించగా తక్షణ వైద్యచికిత్స అవసరమని, దానికి రూ. మూడు లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. దీనితో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం బాధితురాలికి అందజేశారు. ఈసందర్భంగా బాధితురాలు సీఎం, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గుంటిపల్లి వెంకట్, కోతి సాంబరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థిని ఎంపిక



దామెర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జి. చందన ఇటీవల హనుమకొండలో జరిగిన జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో పాల్గొని బహుమతి సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 8 నుంచి 11 వరకు నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చందన, గైడ్ రమేష్ రెడ్డి పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. చందనకు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు స్మార్ట్‌టీవీ బహూకరణ

శాయంపేట: మండలంలోని ప్రగతి సింగారం గ్రామ ప్రభుత్వ పాఠశాలకు బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ శనివారం స్మార్ట్‌టీవీ, కంప్యూటర్, స్పీకర్స్, టేబుల్స్, కుర్చీలను బహూకరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ పోతు సుమలతరమణారెడ్డి హాజరై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవునూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వీరేశలింగం, కర్రు ఆదిరెడ్డి, సురేంద్ర, కొమురయ్య, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానదినోత్సవ వేడుకలు



ఎల్కతుర్తి: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో జ్ఞానదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో వరంగల్ ఆర్సీఓ విద్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) హనుమకొండ ఆధ్వర్యంలో ఆసంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ చాతర్ల సదానందం ఆమెకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్సీఓకు జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, హేమలత, రజిని, మౌనిక, ఉపేంద్ర, సునీత, అరవింద్, దేవరాజ్, వేణు, రఘు, మహేష్, కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ భవనం

శాయంపేట: మండల కేంద్రంలోని దళిత కాలనీలో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ భవనం కేవలం పిల్లర్లకే పరిమితమైందని, తక్షణమే నిర్మాణ పనులు పూర్తి చేయాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు మారంపెల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం శిలాఫలకం వేసి ఏడాది గడిచిన ఇప్పటి వరకు కేవలం పిల్లర్లకే పరిమితమైందన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులను కలిసిన పనులు పూర్తి చేయలేదని ఆక్షేపించారు. నిర్మాణం పూర్తి చేయకపోతే ఉద్యమిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కుమార్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

గ్రామకమిటీల ఎన్నిక

ఎల్కతుర్తి: మండలంలోని మూడు గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేశవాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ఈర రమేష్, ఉపాధ్యక్షుడిగా కడిపికొండ రజినీకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోలు అశోక్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.రవి, ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

గుంటూర్‌పల్లిలో..

మండలంలోని గుంటూర్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సూదిరెడ్డి తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా గణేష్, నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా భాష నరసింహారావు, సంయుక్త కార్యదర్శిగా ఏకానందం ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

ఆరేపల్లి గ్రామంలో..

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సైతం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. గ్రామ అధ్యక్షుడిగా మాటూరి సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా పోతరబోయిన ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కాతకొండ కమలాకర్, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా దుర్గం కొమురయ్య ఎన్నికయ్యారు.

ఐలోనికి రావాలని రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా జరిగే జాతరకు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు మల్లన్న చిత్రపటాన్ని అందించి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆహ్వానించిన వారిలో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, ఎంపీటీసీ బీరం మౌనిక, సొసైటీ డైరెక్టర్ చిరంజీవి, మహేందర్, సమ్మెట మహేందర్, సునీల్, రహీం పాషా, భాస్కర్, భరత్, సాంబయ్య, రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.